క్లుప్తంగా

తాండవ జలాశయంలో జోరుగా రొయ్యల వేట



జలాశయంలో వేటాడిన రొయ్యలు

గొలుగొండ: తాండవ జలాశయంలో రొయ్యల వేట జోరుగా సాగుతోంది. ఫిబ్రవరి చివరి వారం నుంచి మే చివరి వారం వరకు ఈ వేట నిర్వహిస్తారు. జలాశయం పరిధిలో ఉన్న గొలుగొండ, సాలికమల్లవరం, అమ్మపేట, గాదంపాలెం, విప్పలపాలెం, వెంకటాపురం తదితర ప్రాంతాల్లో జాలర్లు ప్రతి రోజూ వేట జరుపుతున్నారు. సుమారు రెండువందల మంది జాలర్లు ఈ సీజన్‌లో జలాశయంలో చేపలవేట సాగిస్తారు. అనుకుంతగా రొయ్యలు వలలో పడడం లేదని జాలర్లు ఆవేదన వ్యక్తం చేశారు.

తారురోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



తారురోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్‌లు

మాడుగుల రూరల్‌: ముకుందపురం నుంచి వంటర్లపాలెం వరకూ నిర్మించనున్న తారు రోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ రెండు గ్రామాల మధ్య రెండున్నర కిలోమీటర్ల మట్టిరోడ్డు గుండా ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడేవారు. ప్రజల ఇబ్బందులను గుర్తించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తారురోడ్డు నిర్మాణానికి రూ.74లక్షలకు మంజూరు చేశారు.నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణానికి రెండు గ్రామాల సర్పంచ్‌లు కర్రి గణేష్‌, అల్లాడ నాగేశ్వరరావు, ఎంపీటీసీ దండి నాగరత్నం శుక్రవారం భూమి పూజ నిర్వహించారు.

ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి



పునాదులను పరిశీలిస్తున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, జేఈ జోగారావు

నాతవరం: జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి, ఉగాది నాటికి ప్రారంభించాలని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, హౌసింగ్‌ జేఈ జోగారావు సూచించారు. మండలంలో నాతవరం,గుమ్మడిగొండ,రాజుపేట, అగ్రహారం గ్రామాల్లో జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం వారు పరిశీలించారు.ఈ సందర్భంగా వారు లబ్ధిదారులతో మాట్లాడుతూ నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణం ప్రారంభించకపోతే రద్దు చేసే అవకాశం ఉందని చెప్పారు. లబ్ధిదారుల సందేహాలను జేఈ జోగారావు నివృత్తి చేశారు. పి.కె.గూడెం పీఏసీఎస్‌ పర్సన్‌ఇన్‌చార్జి గుడపర్తి అచ్చియ్యనాయుడు, వర్కు ఇన్‌స్పెక్టర్‌ రామకృష్ణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



చిన్నారులతో మాట్లాడుతున్న యాదగిరీశ్వరరావు

నాతవరం: కలెక్టరు ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తున్నట్టు ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు తెలిపారు. మండలంలో రాజుపేట అగ్రహారంలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. గర్భిణులకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకునేలా వారిలో అవగాహన కల్పించాలని, పీహెచ్‌సీలో ప్రసవాలు జరిగేలా చూడాలని అంగన్‌వాడీ కార్యకర్తకు సూచించారు.

సీపీఎస్‌ రద్దు చేయాలి

కె.కోటపాడు : సీపీఎస్‌ రద్దు చేసి పాత పెన్షన్‌ విధానాన్ని అమలు చేయాలని ఉభయ కమ్యూనిస్టు పార్టీల నాయకులు జి.నాయినిబాబు, వేచలపు కాసుబాబు కోరారు. ఆ పార్టీల పిలుపు మేరకు కె.కోటపాడులో ఉద్యోగుల సమస్యలపై రాస్తారాకో చేశారు. అనంతరం తహసీల్దార్‌ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

అభివృద్ధి పథంలో మాడుగుల

- రూ.కోటితో డ్రైనేజీల నిర్మాణం
- జోరుగా సాగుతున్న పనులు



రామచంద్రాపురం గిరి గ్రామానికి వేసిన రోడ్డు



మాడుగుల హైస్కూల్‌ కాలనీలో నిర్మాణం పూర్తయిన డ్రైనేజీలు

మాడుగుల: నియోజకవర్గ కేంద్రం మాడుగుల పట్టణం అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోంది. గతంలో డ్రైనేజీలు పూడుకుపోయి, వీధులు జుగుప్సాకరంగా ఉండి, దుర్వాసనతో పట్టణ వాసులు తీవ్ర అవస్థలకు గురయ్యేవారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రతి వార్డులో పర్యటించి డ్రైనేజీల దుస్థితిని పరిశీలించారు. స్పందించిన ఆయన వెంటనే నిధులు మంజూరు చేశారు. దీంతో పలు ప్రాంతాల్లో డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణం పనులు జోరుగా సాగుతున్నాయి. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం పూర్తవడంతో గవరవీధి, జగ్గన్న సావిడి, హైస్కూల్‌ కాలనీ, గదబూరు, మోదమాంబ కాలనీలు చూడముచ్చటగా దర్శనమిస్తున్నాయి. మాడుగుల పట్టణానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న రామచంద్రాపురం గిరిజన గ్రామానికి కూడా పక్కా రోడ్డు నిర్మించారు. రానున్న మూడు నెలల్లో పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో డ్రైనేజీలు నిర్మించడంతో పాటు ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయడానికి ఎంపీపీ వేమవరపు రామధర్మజ ఆధ్వర్యంలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

అవస్థలు తీరాయి

ఎన్నో ఏళ్లు డ్రైనేజీలు లేక ఇబ్బందులు పడ్డాం. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ సీఎం మా కాలనీని సందర్శించడంతో దశ తిరిగింది. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. కాలనీ వాసులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న డిప్యూటీ సీఎంబూడి ముత్యాలనాయుడుకు కృతజ్ఞతలు. – కుంచా భవాని, హైస్కూల్‌ కాలనీ, మాడుగుల

ఆనందంగా ఉంది

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన హామీలను డిప్యూటీ సీఎం నెరవేర్చారు. విద్యుత్‌ వైర్లు సరిచేయిండంతో పాటు డ్రైనేజీలు నిర్మించారు. చాలా ఆనందంగా ఉంది.
– ఎద్దు అప్పారావు, మాడుగుల.

ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ తగదు



నినాదాలు చేస్తున్న కాంగ్రెసు పార్టీ నాయకులు

మాడుగుల రూరల్‌: ఎల్‌ఐసీ, ఎస్‌బీఐ తదితర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించ వద్దని, ఆదానీ సంస్థలో జరుగుతున్న ఆర్థిక అవకతకవకలపై జాయింట్‌ పార్లమెంటు కమిటీ వేయాలని కోరుతూ శుక్రవారం కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో మాడుగులలో నిరసన వ్యక్తం చేశారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పడాల కొండలరావు సారథ్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు భీమరశెట్టి భవాని, నియోజకవర్గ ఎస్సీ సెల్‌ అధ్యక్షుడు బుడబండి రాజు, మండల బీసీ సెల్‌ అధ్యక్షుడు బాలిబోయిన అప్పారావు, బ్లాక్‌ కాంగ్రెసు అధ్యక్షుడు పుట్టా అమరయ్యగుప్తా, టౌన్‌ పార్టీ అధ్యక్షుడు బోడ్డు నాని, ముకుందపురం మాజీ సర్పంచ్‌ పొట్ల కళ్యాణం పాల్గొన్నారు.

నదిలో మట్టిరోడ్డు నిర్మాణం



సర్పానదిలో నిర్మించిన మట్టి రోడ్డు

మాకవరపాలెం: మండలంలోని నారాయణరాజుపేట గ్రామస్తులు సర్పానదిలో రహదారి నిర్మించుకున్నారు. మాకవరపాలెం–నారాయణరాజు మధ్యలో సర్పానది ఉంది. ఈ గ్రామస్తులు మండల కేంద్రానికి రావాలంటే పి.పి.అగ్రహారం మీదుగా సుమారు నాలుగు కిలోమీటర్లు తిరిగి రావాల్సిఉంది. నది అవతల ఉన్న తమ పొలాలకు వెళ్లేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం నదిలో నీరు తగ్గడంతో శుక్రవారం గ్రామస్తులంతా ఒక్కటై తాత్కాలికంగా మట్టిరోడ్డును నిర్మించారు. ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మించాలని వారు కోరారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



రావికమతంలో వ్యాక్సిన్‌ వేస్తున్న సిబ్బంది

రావికమతం:రావికమతం, రోలుగుంట మండలాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం జోరుగా సాగుతోంది. పశుసంవర్ధక శాఖ రావికమతం ఏడీ టి.పుష్ప శుక్రవారం వ్యాక్సినేషన్‌ను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సాధారణంగా అక్టోబరు నెలలో వస్తుందన్నారు. ఈ నెలాఖరు వరకూ టీకా కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఇప్పటి వరకూ రావికమతం,రోలుగుంట మండలాల్లో 5,270 డోసులు వేశామన్నారు.

మహిళలపై నేరాలు ఆందోళనకరం



మాట్లాడుతున్న సీనియర్‌ సివిల్‌ జడ్జి సాయికుమారి

యలమంచిలి : సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు ఆందోళనకరమని యలమంచిలి సీనియర్‌ సివిల్‌ జడ్జి ఎ.సాయికుమారి అన్నారు. అంతర్జాతీయ మహిళా న్యాయ వారోత్సావాల్లో భాగంగా మండల న్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం యలమంచిలి కోర్టు సముదాయంలో వెలుగు, వలంటీర్లు, డ్వాక్రా సంఘాలకు చెందిన మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యలమంచిలి సీనియర్‌ సివిల్‌ జడ్జి ఎ.సాయికుమారి విచ్చేసి మహిళలను ఉద్దేశించి ప్రసంగించారు. ఇటీవల కాలంలో మహిళలపై లైంగిక దాడులు అధికమయ్యాయని అన్నారు. ఇటువంటి అఘాయిత్యాలపై అవగాహన కలిగి, జాగ్రత్తలు పాటించాలని, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్లలో వచ్చే సందేశాల్లో మంచి చెడులపై అవగాహన కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరూ సమాజంలో ఉన్నతమైన స్థానానికి వెళ్లే ప్రణాళికలు రచించుకోవాలని తెలిపారు. మహిళలకు అన్ని విధాలుగా న్యాయ సహాయం అందించేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని అన్నారు. ఏజీపీ డి.వెంకట్రావు, బార్‌ అసోసియేషన్‌ ప్రెసిడెంట్‌ తాళ్ల సత్యనారాయణ, న్యాయవాదులు కోట్ని దుర్గాప్రసాద్‌, కొరెడ్డి అప్పలస్వామినాయుడు పాల్గొన్నారు.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



చోడవరంలో విశాఖడెయిరీ అధ్యక్షులు, కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న విప్‌ కరణం ధర్మశ్రీ



నర్సీపట్నంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్‌



గొండుపాలెంలో పట్టభద్రులను కలిసి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న అనురాధ

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం శుక్రవారం విస్తృతంగా నిర్వహించారు. అభ్యర్థుల విజయానికి ఆయా పార్టీల నేతలు పలు గ్రామాల్లో ప్రచారం చేశారు.

చోడవరం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలని ప్రభుత్వ విప్‌ కరణం ధర్మశ్రీ కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా చోడవరంలో పాలసంఘాల అధ్యక్ష, కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. డెయిరీ డైరెక్టర్‌ దాడి పవన్‌కుమార్‌ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ధర్మశ్రీ మాట్లాడుతూ పాలసంఘాల్లో పనిచేస్తున్న పట్టభద్రులైన అధ్యక్షులు, కార్యదర్శులు అందరూ వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు ఓటువేసి గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో పాలసంఘాల అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నర్సీపట్నం: వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌ గణేష్‌ కోరారు. నర్సీపట్నం మున్సిపాలిటీలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్‌ కళాశాలలు, ఎంపీడీవో కార్యాలయం, సచివాలయాలల్లో ఎమ్మెల్యే ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ గుడబండి ఆదిలక్ష్మి, మున్సిపల్‌ వైస్‌చైర్మన్‌ గొలుసు నర్సింహమూర్తి, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఏకా శివ, దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌ చెరుకూరి సత్యనారాయణ, కౌన్సిలర్‌ సిరసపల్లి నాని, అయ్యరక కార్పొరేషన్‌ డైరెక్టర్‌ కర్రి శ్రీనివాసరావు, సర్పంచ్‌ శానపతి వెంకటరత్నం, మున్సిపాలిటీ సచివాలయాల కన్వీనర్‌ తమరాన శ్రీను, పార్టీ నాయకులు చింతకాయల వరుణ్‌, ధనిమరెడ్డి ప్రసాద్‌, గంటా లలిత పాల్గొన్నారు.

పట్టణంలో..
ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ గెలుపును కాంక్షిస్తూ మున్సిపల్‌ మాజీ వైస్‌చైర్మన్‌, వైఎస్సార్‌సీపీ సీనియర్‌ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఆర్డీవో, ఐసీడీఎస్‌, తహసీల్దార్‌, సబ్‌ట్రెజరీ కార్యాలయా లు, ప్రభుత్వ, ప్రైవేట్‌ కళాశాలల్లో పట్టభద్రుల ఓటర్లను కలిసి సుధాకర్‌కు ఓటు వేయాలని కోరారు. ఆయన వెంట సుర్ల నాయుడు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్‌ కుమార్‌బాబు, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

బుచ్చెయ్యపేట: వైఎస్సార్‌ సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని వైఎస్సార్‌ సీపీ వడ్డాది టౌన్‌ అధ్యక్షుడు నారాయణమూర్తి కోరారు. సుధాకర్‌కు మద్దతుగా వడ్డాదిలో గురువారం ఆయన స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. శింగవరం,లోపూడి,బంగారుమెట్ట, ఎల్‌బీ పురాలలో వైఎస్సార్‌సీపీ నాయకులు సాయం రమేష్‌,యెనుముల వాసు,వేపాడ మధు,తమరాన శ్రీను, రమణ తదితర్లు ప్రచారం చేశారు. డీసీసీబీ మాజీ డైరెక్టర్‌ కోవెల జనార్దనరావు,ఎంపీటీసీ కోరుకొండ లీలావతి రమణ,ఇంటి అప్పారావు తదితర్లు పాల్గొన్నారు.

కె.కోటపాడు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్‌ కోరారు. కె.కోటపాడు మండలంలో ఎ.కోడూరు, గొండుపాలెం, సూరెడ్డిపాలెం, సింగన్నదొరపాలెం, గొండుపాలెం గ్రామాల్లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పట్టభద్రులు,ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులను కలిసి సుధాకర్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు బండారు కనక మల్లీశ్వరి, రొంగలి వెంకటరమణ, బండారు రామస్వామిపాత్రుడు, తర్రా సన్యాసమ్మ, బండారు దేముళ్ళు, ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు, మాజీ వైస్‌ ఎంపీపీ బండారు మంగపతి, మాజీ సర్పంచ్‌ వంటాకు శ్రీను, దొగ్గ ఉమాశంకర్‌ పాల్గొన్నారు.

మాడుగుల రూరల్‌: వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా వీజే పురం, డి.గొటివాడ శివారు ఓ.కె. శ్రీరామ్‌పురం గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేశారు. చామంతులు అచ్చిబాబు, మంజి శంకరరావు,సర్పంచ్‌ గోకాడ అర్జున్‌రావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

చీడికాడ: వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా చీడికాడలో ఆ పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు,ఉమ్మడి విశాఖ జెడ్పీ స్త్రీ శిశుసంక్షేమ శాఖ స్టాండింగ్‌ కమిటీ చైర్మన్‌ ఈర్లె అనురాధ,నియోజక వర్గ పరిశీలకులు ఊరికూటి అప్పారావు ప్రచారం చేశారు. జెడ్పీటీసీ భర్త లాలం శారదాజానకీరాం, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు,యూత్‌ అధ్యక్షుడు స్వామినాయుడు,మండల సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జి ఈర్లె చైతన్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం
నాతవరం: ఉత్తరాంధ్ర పట్టభద్రులు ఎమ్మెల్సీ స్థానానికి బీజేపీ మద్దతుతో పోటీ చేస్తున్న పి.వి.ఎల్‌.మాధవ్‌ను గెలిపించాలని ఆపార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తమరాన ఎర్రినాయుడు కోరారు. మండలంలో గునుపూడి, చినగొలుగొండపేట, పెదగొలుగొండపేట, నాతవరం, రాజుపేట అగ్రహారం, ములగపూడి, డి.యర్రవరం గ్రామాల్లో శుక్రవారం మండల పార్టీ అధ్యక్షుడు లాలం వెంకటరమణతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.



సుధాకర్‌కు ఓటు వేయాలని కోరుతున్న సన్యాసిపాత్రుడు

డీ వార్మింగ్‌ డేను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న



మాట్లాడుతున్న ఎంపీడీవో సీహెచ్‌. సుబ్బలక్ష్మి, ఎంఈవో రవీంద్రబాబు

దేవరాపల్లి: జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని(డీ వార్మింగ్‌ డే) పురస్కరించుకుని చిన్నారులకు ఈ నెల 14న నిర్వహించనున్న నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక ఎంపీడీవో సీహెచ్‌.సుబ్బలక్ష్మి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో దేవరాపల్లి, వేచలం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్‌.లలిత, జి.గోవిందరెడ్డి, మండల విద్యాశాఖ అధికారి సీహెచ్‌. రవీంద్రబాబుల సమక్షంలో వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, పాఠశాలలు విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేయాలని సూచించారు.

నాతవరం: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 14న మండల వ్యాప్తంగా అన్ని పాఠశాల్లో విద్యార్థులకు డివార్మింగ్‌ మాత్రలు అందజేసి, వారితో మింగించాలని నాతవరం, గునుపూడి పీహెచ్‌సీల వైద్యాధికారులు ప్రసన్న, వి.పద్మప్రియ తెలిపారు. మండల పరిషత్‌ కార్యాలయంలో మండల స్థాయిలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 14న మాత్రలు వేసుకోని విద్యార్థులకు 18వ తేదీన తప్పనిసరిగా వేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, ఎంఈవో తాడి అమృత్‌కుమార్‌, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోలుగుంట: నులి పురుగుల నివారణ ద్వారా పిల్లల ఆరోగ్యం మెరుగుపరచాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి విమలగిరి అన్నారు. ఈ నెల14న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై స్థానిక మండల పరిషత్‌ సమావేశ మందిరంలో శుక్రవారం ఐసీడీఎస్‌, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు అల్బెండజోల్‌ మాత్రలు పంపిణీ చేయాలని తెలిపారు. ఈవోపీఆర్డీవో మల్లికార్జునరావు, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ పెట్ల సత్యవతి, కొమరవోలు హెచ్‌ఎం ఏ.ఆర్‌.విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: డీ వార్మింగ్‌ డే సందర్భంగా 1–19 ఏళ్ల మధ్య వయసు ఉన్న 11,581 మందికి అల్బెండజోల్‌ మాత్రలు పంపిణీ చేయనున్నట్టు వైద్యాధికారి శ్రీవిద్య తెలిపారు. మండల పరిషత్‌ కార్యాలయంలో శుక్రవారం డీ వార్మింగ్‌ డేపై వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో అరుణశ్రీ మాట్లాడుతూ పిల్లలందరితో వైద్య సిబ్బంది మాత్రలు వేయించాలన్నారు.



రోలుగుంటలో మాట్లాడుతున్న వైద్యాధికారి విమలగిరి

మృతుడి కుటుంబానికి డిప్యూటీ సీఎం బూడి పరామర్శ



సంజీవ మెట్ట వద్ద ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: దేవరాపల్లి–ఆనందపురం రహదారిలో సంజీవమెట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎ.కొత్తపల్లి పంచాయతీ శివారు సంజీవపురానికి చెందిన కొటాన అప్పలనాయుడు మృతి చెందడం పట్ల ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు విచారం వ్యక్తం చేశారు. సంజీవమెట్ట వద్ద ప్రమాదం జరిగిన స్థలాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దారపురెడ్డి నాయుడుకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆస్పత్రి వైద్యులకు ఫోన్లో సూచించారు. ఆయన వెంట ఎ.కొత్తపల్లి సర్పంచ్‌ చింతల సత్య వెంకటరమణ, ఉప సర్పంచ్‌ పండూరి సరువునాయుడు తదితరులు ఉన్నారు.

బీమా రంగం దేశ ఆర్థిక అభివృద్ధికి మూలం



బీమా ఆవశ్యకతను వివరిస్తున్న సలహాదారు

చోడవరం రూరల్‌: దేశ ఆర్థిక వ్యవస్థకు బీమా రంగం పట్టుకొమ్మలా ఉపకరిస్తుందని బీమా సలహాదారు ఎల్‌.వి.నాగేశ్వరరావు అన్నారు. దేశ అభివృద్ధికి బాటలు వేయడానికి బీమా రంగమే ప్రధాన ఆర్థిక వనరు అని అన్నారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్థిక శాస్త్ర విభాగం అధిపతి టి.రాధాకృష్ణ ఆధ్వర్యంలో బీమా రంగం పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యవక్తగా నాగేశ్వరరావు ప్రసంగించారు. బీమా రంగ ప్రయోజనాలు, ప్రాధాన్యతతో పాటు వివిధ రకాల బీమా పథకాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు



కె.కోటపాడులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న నాగలక్ష్మి

కె.కోటపాడు : జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి, ఉగాదికి గృహప్రవేశాలు చేయాలని మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి తెలిపారు. కె.కోటపాడులో జగనన్న లేఅవుట్‌లో లబ్ధిదారులతో శుక్రవారం మాట్లాడారు. ఇళ్ల నిర్మాణ దశలను బట్టి లబ్ధిదారుల బ్యాంక్‌ ఖాతాల్లో నగదు జమచేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శచీదేవి, హౌసింగ్‌ ఏఈ రవిబాబు, పంచాయతీ విస్తరణాధికారి ప్రసాద్‌, పంచాయతీ కార్యదర్శి వి.ప్రసాద్‌ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల స్వాధీనం



కశింకోటలో పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎద్దు, ఆవులు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం కూడలిలో అక్రమంగా రవాణా చేస్తున్న 40 పశువులను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు కంటైనర్‌లో తరలిస్తున్న 35 ఎద్దులు, 5 ఆవులను వాహనాల తనిఖీలో భాగంగా పట్టుకున్నట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్‌ జిల్లాకు చెందిన డ్రైవర్‌ లంతూరు విశాల్‌ (28), నిర్వాహకుడు జార్ఖండ్‌కు చెందిన మహ్మద్‌ సద్దాంలను అరెస్టు చేశామన్నారు. కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.